సాక్షి ప్రకాశం
గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



మీటర్ రీడర్లకు కూటమి షాక్!
కరెంటు మీటర్ల స్థానంలో ప్రస్తుతం రీచార్జ్ స్మార్ట్ మీటర్లు బిగిస్తుండటంతో విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న మీటర్ రీడర్ల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. - 8లో..



చెరువులో దూకి బిడ్డతో సహా తల్లి బలవన్మరణం
ఎనిమిది నెలల పసిబిడ్డతో సహా తల్లి చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం వెలుగు చూసింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
33/23

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

డీఆర్‌డీఏ పీడీగా నారాయణ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న పీడీ

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా టి.నారాయణ బుధవారం ప్రగతి భవన్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు.

వారబంధి పకడ్బందీగా అమలు చేయాలి
● కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: వారబంధి విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవనంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సరిహద్దు 85/3 మైలు వద్ద నుంచి వస్తున్న నాగార్జున సాగర్ నీటిని నిరంతరం గమనిస్తూ ఉండాలని చెప్పారు. వస్తున్న నీటిని పరిగణనలోకి తీసుకొని జిల్లాలో నీటి అవసరం ఉన్న ప్రాంతాలకు మళ్లించాలని దిశానిర్దేశం చేశారు. రైతులు కూడా సాగు అవసరాలకే వినియోగించుకోవాలని, నీటిని వృథా చేయకుండా అధికార యంత్రాంగానికి సహకరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. గత డీఆర్‌సీ సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి తీసుకున్న సమస్యలపై ఆరా తీశారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, ప్రాజెక్టు ఎస్ఈ నాగమురళి, ఇరిగేషన్ ఈఈలు, డీఈఈలు పాల్గొన్నారు.

మార్కాపురాన్ని జిల్లా చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న వెంకటరామిరెడ్డి తదితరులు

మార్కాపురం: మార్కాపురాన్ని వెంటనే జిల్లా చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో మార్కాపురాన్ని జిల్లా చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. 25 మండలాలు కలిపి మార్కాపురాన్ని జిల్లా చేయడంతో పాటు శ్రీశైలాన్ని కూడా మార్కాపురంలో కలపాలని కోరారు. గిద్దలూరులో ఆర్డీఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, మార్కాపురంలో యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని, హనుమాన్ జంక్షన్, గొట్లగట్టు, గజ్జలకొండ, తాటిచర్ల మోటు గ్రామాలను మండలాలుగా చేయాలని కోరారు. వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తిచేసి నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన సంయుక్త సంచాలకులు
నాగులుప్పలపాడు: పాఠశాల విద్య గుంటూరు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు లింగేశ్వర రెడ్డి మండలంలోని పోతవరంలో ఎయిడెడ్ పాఠశాల, ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. పాఠశాల నిర్వహణపై ఉపాధ్యాయులతో సమీక్షించి సలహాలు, సూచనలు చేశారు. అదేవిధంగా నాగులుప్పలపాడు హైస్కూలు ఆవరణలో జరుగుతున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలంతా ఆరు రోజుల పాటు ఇచ్చే శిక్షణ కార్యక్రమాన్ని ఉపయోగించుకుని అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి టి.రవి, ఇన్‌చార్జ్ హెచ్ఎం వెంకట సుబ్బయ్య, రిసోర్స్ పర్సన్లు మాలకొండయ్య, నాగరాజు, సూపర్‌వైజర్లు ఉషారాణి, శ్రీదేవి పాల్గొన్నారు.

ఓ పద్ధతి పాడు ఏం లేదు. ప్రజలకు ఏం చేయాలో స్పష్టత లేదు. ప్రజల సమస్యలపై ఏమాత్రం చర్చ ఉండదు. అంకెల గారడీ..కాకి లెక్కలతో వాస్తవాన్ని మరిచి ప్రజలను పన్నుల పేరుతో వేధించడమే పరమావధి. ఇది ఒంగోలు నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశం జరిగిన తీరు. కీలకమైన బడ్జెట్ సమావేశానికి మూడు గంటలు ఆలస్యంగా వచ్చిన ఎమ్మెల్యే దామచర్ల..ఎక్కడ నుంచో కోట్లాను కోట్లు నిధులు వస్తాయంటూ మభ్యపెట్టడం గమనార్హం. అంతా కాకిలెక్కలేసి నగరాన్ని అభివృద్ధి చేస్తామంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు బీరాలు పలికారు



ఒంగోలు నగర వ్యూ

అంకెల గారడీతో.. అభివృద్ధి చేస్తారట..!

- నగరపాలక సంస్థ బడ్జెట్ అంతా కాకి లెక్కలే..!
- 2017 బీపీఎస్ బకాయిలను ఈ బడ్జెట్లో చూపిన వైనం.
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లపై ఆశలు
- రూ.210 కోట్ల పద్దులో ఖర్చులకే రూ.196 కోట్లు
- వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులకు సుమారు రూ.100 కోట్లు
- ప్రజలపై పన్నుల భారం కుట్ర

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టేందుకు నగర పాలకులు చేసిన ప్రయత్నం బడ్జెట్ సమావేశంలో స్పష్టంగా కనిపించింది. పేరుకు వందల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెట్టిన నగర పాలకులు..సమావేశంలో జరిగిన చర్చలో మాత్రం ఆదాయ మార్గాల గురించి ప్రధానంగా దృష్టి సారించడం గమనార్హం. ప్రస్తుతం ఆర్థిక పరిస్థితి ఏ మాత్రం బాగాలేదని చెప్పిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్...ప్రజల నుంచి రావాల్సిన వివిధ రకాల పన్నులను మొత్తం వసూలు చేయాల్సిందేనంటూ పదే పదే చెప్పడం గమనార్హం. ఒకవైపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీ మొత్తంలో గ్రాంట్లు వస్తాయని ఆశలు చూపుతూనే..మరోవైపు ప్రజలపై ఎన్ని రకాల పన్నులు వేయవచ్చో ఆరా తీయడం సభ్యులను విస్మయానికి గురిచేసింది. మొత్తం మీద ప్రజలను బురిడీ కొట్టించేందుకు నానా తంటాలు పడిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు రూ.210 కోట్ల బడ్జెట్ పేరుతో ప్రజల చెవిలో పూలు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రతిపక్ష సభ్యులు ఆరోపిస్తున్నారు.

రూ.210 కోట్ల బడ్జెట్...

నగరపాలక సంస్థ 2025-26 బడ్జెట్‌ను రూ.210.79 కోట్లతో ఆమోదించారు. ఇందులో ఖర్చులు రూ.196 కోట్లు కాగా మిగులు బడ్జెట్ రూ.13.98 కోట్లుగా తేల్చారు. పైకి చూసేందుకు ఈ బడ్జెట్ రంగుల కలలను ఆవిష్కరిస్తుంది. వాస్తవంలోకి వచ్చి చూస్తే ఒట్టి చేతులు మాత్రమే మిగులుతాయని ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు. ఈ రూ.210 కోట్ల బడ్జెట్లో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ క్రమబద్ధీకరణ (బీపీఎస్) బకాయిలు రూ.10 కోట్లను కూడా చూపారు. నిజానికి 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉంది. అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకాన్ని పెట్టారు. అప్పుడు ఇవ్వాల్సిన బకాయిలను ఇవ్వకపోవడంతో అది పెండింగ్‌లో ఉండిపోయింది. అయితే ఒంగోలు మున్సిపాలిటీగా ఉన్నప్పుడు కూడా బడ్జెట్లో ఈ బకాయిలను చూపించేవారని, ఇప్పుడు కూడా ఆ నాటి బకాయిలను చూపించడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలని అధికార పార్టీ కార్పొరేటర్లు చెవులు కొరుక్కుంటున్నారు. ఇకపోతే కేంద్ర, రాష్ట్ర గ్రాంట్లపైనే పాలకవర్గం ఆశలు పెట్టుకున్నట్లు కనిపిస్తుంది. ఏకంగా రూ.52.20 కోట్ల గ్రాంట్లు వస్తాయని ఈ బడ్జెట్లో అంచనా వేశారు. ఒకవైపున కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే బడ్జెట్ ప్రవేశపెట్టింది. అందులో రాష్ట్రానికి ఒట్టి చేతులు చూపింది. అమరావతి నిర్మాణం గురించి సైతం కనీసం ప్రస్తావించలేదు. అలాంటిది నగర పాలక సంస్థలకు గ్రాంట్లు ఇవ్వడం అనేది భ్రమ మాత్రమేనని మేధావులు చెబుతున్నారు. అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే రూ.లక్ష కోట్లు అప్పులు చేసి రికార్డు సృష్టించిన రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు గానీ, గ్రాంట్లు గానీ ఇచ్చే పరిస్థితి లేదు. ఈ విషయం తెలుసు కనుకనే నిధుల మంజూరు కోసం సీఎం చంద్రబాబు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ చుట్టూ తిరుగుతున్నానని ఎమ్మెల్యే దామచర్ల చెప్పడం గమనించవచ్చు.

బకాయిల కోసం దుకాణాలు కూల్చివేస్తారా?
ఆదాయ మార్గాల గురించి ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ కొత్త కూరగాయల మార్కెట్ కూల్చివేత గురించి ప్రస్తావించారు. ఇటీవల కొత్త కూరగాయల మార్కెట్లో దుకాణాలను నగర పాలక సంస్థ కూల్చివేయడం తెలిసిందే. గత ఇదేళ్లుగా మార్కెట్‌లోని వ్యాపారులు అద్దెలు చెల్లించకపోవడంతో బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయాయాని ఎమ్మెల్యే చెప్పారు. మొత్తం బకాయిలు రూ.12 కోట్ల వరకు ఉందని, వివిధ మార్గాల ద్వారా అధికారులు ఒత్తిడి తీసుకుని వస్తే రూ.54 లక్షలు వసూలయ్యాయని సభకు వివరించారు. ఈ విషయంపై వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. బకాయిలు ఉంటే దుకాణాలను ఖాళీ చేయించి టెండర్ వేసి మరొకరికి అద్దెకు ఇవ్వాలి గానీ కూల్చి వేయడం సమర్థనీయం కాదని నిలదీశారు.

ప్రతి ఇంటికి పన్నులు వేయాలి..
నగరంలో అనేక ఇళ్లకు పన్నులు వేయడం లేదని, అన్నీ ఇళ్లకు పన్నులు వేసి వసూలు చేయడం ద్వారా ఆదాయం వస్తుందని ఒక సభ్యుడు సూచించారు. నగరంలో అనేక ఖాళీ స్థలాలు ఉన్నాయని, వాటన్నింటిపై పన్నులు వేస్తే సుమారు రూ.10 కోట్ల వరకు ఆదాయం వస్తుందని మరో సభ్యుడు సలహా ఇచ్చారు. బడ్జెట్ సమావేశంలో అధికార పార్టీ సభ్యులంతా దాదాపుగా ప్రజలపై పన్నులు వేయడం గురించే సూచనలు, సలహాలు ఇచ్చారు. వచ్చే నెల తర్వాత ఖాళీ స్థలాలపై పన్నులు వేసేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. ఈ మొత్తం చర్చలో ప్రజల నుంచి ముక్కు పిండి కొత్త కొత్త పన్నులు వసూలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారన్న అంశం స్పష్టమవుతోంది. ఇక ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ (ఒడా) నుంచి కూడా రూ.10 కోట్లు వస్తాయని అంచనా వేశారు. ఇప్పటికే ఒడా పేరుతో అపార్ట్‌మెంట్ యజమానుల నుంచి అక్రమంగా లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మళ్లీ రూ.10 కోట్ల పన్నులు వేస్తే వారు భయంతో పారిపోవడం ఒక్కటే మిగులుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతోంది.

మంచినీటికే రూ.15 కోట్లే...

నగరం రోజురోజుకు విస్తరిస్తోంది. జనాభా సైతం పెరిగిపోతోంది. వేసవికి ముందే నగరంలో మంచినీటి సమస్య తలెత్తనుంది/ కనుక ఇతరత్రా వృథా ఖర్చులను తగ్గించుకొని ఆ డబ్బులతో ప్రజలకు మంచినీరు అందించాలని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఇమ్రాన్ అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకపోగా పాలక పార్టీ సభ్యులు, ఎమ్మెల్యే దామచర్ల అయనపై ఎదురుదాడికి దిగారు. నెమళ్లు, గుర్రాల బొమ్మలకు లక్షలు ఖర్చు చేస్తున్న పాలకవర్గం ప్రజలకు గుక్కెడు మంచినీళ్లు అందించేందుకు సంసిద్ధంగా లేకపోవడం విచారకరమని ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

గంటలోనే ముగించేశారు..!

- నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశానికి 3 గంటలు ఆలస్యంగా వచ్చిన ఎమ్మెల్యేలు
- గంటలోనే సమావేశం ముగింపు
- కీలకమైన బడ్జెట్ సమావేశంపై చర్చ లేకుండానే ముగింపు
- సమస్యలు ప్రస్తావించిన సభ్యులపై ఎదురుదాడి
- నిధుల కోసం సీఎం చుట్టూ తిరుగుతున్నానంటూ ఎమ్మెల్యే దామచర్ల వ్యాఖ్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత, పక్కన పాల్గొన్న ఎమ్మెల్యేలు, పాలకవర్గ సభ్యులు

ఒంగోలు టౌన్: నగరపాలక సంస్థ కీలకమైన బడ్జెట్ సమావేశం. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం ఎక్స్ అఫీషియో సభ్యులైన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయకుమార్‌లు 3 గంటలు ఆలస్యంగా రావడంతో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైంది. పోనీ అలస్యంగానైనా ప్రారంభించినా కీలకమైన బడ్జెట్ సమావేశంలో ఏమైనా చర్చించారా అంటే అదీ లేదు. మొక్కుబడిగా గంటపాట నిర్వహించి మమ అనిపించి చేతులు దులుపేసుకున్నారు. సమావేశంలో ప్రజల సమస్యలు తలెత్తిన సభ్యులపై ఎమ్మెల్యే దామచర్ల ఎదురుదాడికి దిగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజల నుంచి పన్నులు వసూలు చేయాల్సిందే

నగర ప్రజల నుంచి రావాల్సిన కోట్లాది రూపాయల పన్ను బకాయిలను వసూలు చేయాల్సిందేనంటూ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అధికారులను ఆదేశించారు. 2024-25 సంవత్సరానికి గాను సవరించిన బడ్జెట్‌ను, 2025-26 సంవత్సరం బడ్జెట్ అంచనాలను కలుపుకొని రూ.210 కోట్ల బడ్జెట్‌ను సమావేశంలో ఆమోదించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మంచినీటి సమస్యను ప్రస్తావించిన వైఎస్సార్ సీపీ సభ్యులపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పరోక్ష విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలకు గతంలో వైఎస్సార్ సీపీలో గెలిచి ప్రస్తుతం టీడీపీలో కొనసాగుతున్న మేయర్ గంగాడ సుజాత, ఇతర పాలకవర్గ సభ్యులు నివ్వెరపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నగరాన్ని గాడిలో పెడుతున్నామని చెప్పుకొచ్చారు.

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా...

నగర ప్రజల నుంచి పన్నులు వసూలు చేసి ఆదాయాన్ని పెంచాలని ఎమ్మెల్యే దామచర్ల సూచించారు. ప్రజల నుంచి సక్రమంగా పన్నులు వసూలు చేయకపోవడంతో బకాయిలు పేరుకొనిపోయాయని చెప్పిన ఆయన కొత్త కూరగాయల మార్కెట్లో రూ.12 కోట్ల అద్దె బకాయిలను ప్రస్తావించారు. ప్రజలు రోడ్లపై చెత్త వేస్తే జరిమానా వేయాలని అధికారులకు సూచించారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి కేవలం 8 నెలలు మాత్రమే అయ్యిందని, అపుడే విమర్శలు చేయడం మంచి సంస్కృతి కాదని మండిపడ్డారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేసిందని, మా ప్రభుత్వం కూడా త్వరలోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. నిధుల కోసం ముఖ్యమంత్రి, మున్సిపల్ శాఖ మంత్రి చుట్టూ తిరుగుతున్నానని చెప్పుకున్నారు.

మంచినీటి సమస్య ప్రస్తావించకూడదా..?



సమస్యలపై సమావేశంలో ప్రస్తావిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్

నగరంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, బడ్జెట్లో మంచినీటి సమస్య పరిష్కారానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్ ప్రస్తావించారు. నగర శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నా సరిపోవడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే ఒంగోలు నగరంలోని శివారు ప్రాంత ప్రజలకు మంచి నీరు అందించేందుకు రూ.15 కోట్లు కేటాయించిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయడానికి ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని, నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు కేవలం రూ.15 కోట్లు మాత్రమే కేటాయించిందని చెప్పారు. దీంతో టీడీపీ సభ్యులు ఒక్కసారిగా లేచి విమర్శలు గుప్పించడం మొదలుపెట్టారు. బడ్జెట్ సమావేశంలో మంచి నీటి సమస్య గురించి ఎలా మాట్లాడతారని అడ్డగోలుగా వాదించారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఇమ్రాన్ మాట్లాడుతున్నా వినిపించుకోకుండా గొడవ చేశారు. అయినా ఇమ్రాన్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఒంగోలు నగరంలో మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమృత్ 2.0లో భాగంగా రూ.350 కోట్లు కేటాయించిందని, ప్రస్తుత బడ్జెట్లో దాని ప్రస్తావన లేదని చెప్పారు. మున్సిపల్ లైట్ అండ్ హెవీ వెహికల్ మరమ్మతుల కోసం రూ.2 కోట్లు, డంపింగ్ యార్డ్ నిర్వహణ కోసం రూ.70 లక్షలు కేటాయించారని, ఇలాంటి వాటి ఖర్చు తగ్గించుకొని మంచినీటి కోసం వెచ్చించాలని సూచించారు. అయినా టీడీపీ సభ్యులు మూకుమ్మడిగా మాట్లాడుతుండటంతో ఎవరు ఏం మాట్లాడుతున్నారో అర్థం కాకుండా పోయింది. బడ్జెట్ సమావేశం ప్రారంభిస్తూ సభ్యులు ఏమైనా సలహాలు, సూచనలు ఇవ్వాలని మేయర్ కోరారని, సూచనలు ఇస్తుంటే టీడీపీ సభ్యులు అడ్డు తగులుతున్నారని ఇమ్రాన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష సభ్యులను మాట్లాడవద్దంటే ఎలా అని ప్రశ్నించారు. ఆ తరువాత మాట్లాడిన ఎమ్మెల్యే దామచర్ల వైఎస్సార్ సీపీ సభ్యుడు ఇమ్రాన్ లేవనెత్తిన అంశాలకు జవాబు ఇవ్వకుండా విమర్శలు చేశారు. మైకు చేతిలో ఉందని ఏది పడితే అది మాట్లాడితే నేను కూడా మాట్లాడగలను అంటూ మండిపడ్డారు. మొత్తం మీద ఒకరిద్దరు సభ్యులకు మాత్రమే మాట్లాడే అవకాశం ఇచ్చి బడ్జెట్ ఆమోదించినట్లు మేయర్ ప్రకటించారు. సమావేశంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

భూముల కబ్జాకు ముఠా యత్నం

- టీడీపీ నేత బీటెక్ రవి మనుషులమంటూ బెదిరింపు
- గ్రామస్తుల తిరుగుబాటుతో పలాయనం




డాక్యుమెంట్లు చూయిస్తున్న ముక్తినూతలపాడు గ్రామస్తులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: నలభై మూడేళ్ల క్రితం విక్రయించిన భూములను కబ్జా చేసేందుకు కడప నుంచి వచ్చిన ముఠా ప్రయత్నించడం, గ్రామస్తులు తిరగబడడం బుధవారం సాయంత్రం సంచలనంగా మారింది. గ్రామస్తుల కథనం ప్రకారం... ఒంగోలు మండలంలోని ముక్తినూతలపాడు గ్రామానికి చెందిన సూదనగుంట సుబ్బయ్య కుమారులు హనుమంతరావు, విశ్వేశ్వరరావు, పాండురంగారావులు 1982లో గ్రామంలోని సర్వే నంబర్ 191, 255లలోని 3.55 ఎకరాల భూమిని రావి ఆంజనేయులు, పాతూరి వెంకటశ్వర్లు, పెద్దిరెడ్డి ఆదినారాయణ రెడ్డి, ముప్పా వీరాంజనేయులకు విక్రయించారు. ఈ భూమిని 1988లో 162 ప్లాట్లు వేసి విక్రయించారు. ఆ తరువాత భూమిని విక్రయించిన నలుగురు మరణించారు. అయితే బెంగళూరులో నివసించే సూదనగుంట పాండురంగారావు భార్య శైలజ ఇటీవల ఆ భూమిని తన పేరుపై ఆన్‌లైన్ చేయించుకున్నట్లు సమాచారం. ఆ తరువాత శైలజ కుమారుడు సాయి ఈ భూములను కడపకు చెందిన వ్యక్తులకు విక్రయించినట్లు చెబుతున్నారు. దీంతో కడపకు చెందిన కొందరు వ్యక్తులు కొద్ది రోజుల క్రితం ముక్తినూతలపాడు గ్రామానికి వచ్చి సర్వే నంబర్ 255 భూమిని తాము కొనుగోలు చేశామని, ఆక్రమించుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే స్థలాల వద్దకు వచ్చి మా భూముల్లోకి రావడానికి మీరెవరంటూ కడప నుంచి వచ్చిన ముఠాపై తిరగబడ్డారు. దీంతో వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు.ఆ తరువాత ప్లాట్లు కొనుగోలు చేసిన గ్రామస్తులు కలిసి ఆ భూములను శుభ్రం చేసుకొని రాళ్లు పాతుకున్నారు. అయితే బుధవారం మళ్లీ కడప బీటెక్ రవి అనుచరులమంటూ కొందరు ముక్తినూతలపాడు గ్రామానికి వచ్చారు. భూములు శుభ్రం చేసింది ఎవరంటూ గ్రామస్తులను ప్రశ్నించారు. సర్వే నంబర్ 191,255లోని భూములన్నీ మావేనని, గ్రామస్తులకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. అక్కడ వేసి ఉన్న హద్దురాళ్లను తొలగించి సొంతంగా వేసుకునేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన ప్లాట్లు కొనుగోలు చేసిన గ్రామస్తులు తమ రిజిస్టర్ బాండ్‌లతో అక్కడకు చేరుకున్నారు. ఈ భూములు తాము కొనుగోలు చేసినట్లు సాక్ష్యంగా రిజిస్టర్ కాగితాలను చూపెట్టారు. మీ దగ్గర ఏమైనా సాక్ష్యాలు ఉంటే చూపెట్టమని అడగడంతో వారంతా తెల్లముఖాలు వేశారు. తహసీల్దార్ వద్దకు వెళదామని చెప్పగానే..వారంతా అక్క నుంచి తుర్రుమన్నారు. అయితే వచ్చిన వారంతా కడప బీటెక్ రవి మనుషులమని బెదిరించారని, వారి చేతుల్లోని మొబైల్ ఫోన్లు, కార్లపై కూడా టీడీపీ స్టిక్కర్లు ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ ముఠా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలో హల్‌చల్ చేసినట్లు సమాచారం. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు.

బాలల సంరక్షణకు సమన్వయంతో పనిచేయాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి



మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

ఒంగోలు సిటీ: రాజ్యాంగ వ్యవస్థలోని అన్ని చట్టాలను సమర్థవంతంగా అమలు చేసి బాలల సంరక్షణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో బుధవారం ఉదయం బాలల సంరక్షణకు సంబంధించిన వివిధ కార్యక్రమాల పురోగతిపై మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల మానసిక శారీరక ఎదుగుదలతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తున్నట్లు తెలిపారు. బాలల సంరక్షణ లక్ష్యంగా అనేక వ్యవస్థలు పనిచేస్తున్నాయన్నారు. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల అపహరణ, బాలికలపై లైంగిక దాడులు వంటి అమానవీయ సంఘటనలు జరగకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, జిల్లాలోని బాల బాలికలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించామన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనా సుజన్, జిల్లా కార్మిక శాఖ కమిషనర్, జిల్లా బాలల సంరక్షణ అధికారి, ఐసీడీఎస్ వివిధ విభాగాల అధికారులు, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

■ జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సంక్షేమానికి అధికారులు దృష్టి సారించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. సంక్షేమ శాఖ, వసతి గృహాల సంక్షేమ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సంక్షేమ వసతి గృహాల్లో పిల్లలు అనేక ఇబ్బందులకు, మానసిక వేధింపులకు గురవుతున్నారని పేర్కొన్నారు. సంక్షేమ వసతి గృహాలు ఉండే పిల్లలకు, పాఠశాలలో పాఠ్యాంశాలతో పాటు బాలల చట్టాలపై కూడా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్ నరసింహస్వామి, ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారి అంజలి, వికలాంగుల శాఖ అధికారి అర్చన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి
● జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



చింతలపాలెంలో జరుగుతున్న భూ రీసర్వేపై అధికారులతో చర్చిస్తున్న జేసీ గోపాలకృష్ణ

పామూరు: భూ రీసర్వే పనులను రెవెన్యూ సర్వే సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని చింతలపాలెంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో కనిగిరి ఆర్డీఓతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే జరుగుతున్న తీరుపై తహసీల్దార్, మండల సర్వేయర్‌లతో చర్చించి మ్యాప్‌లను పరిశీలించారు. భూ రీసర్వేపై స్థానిక రైతులతో చర్చించి సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. భూ రీసర్వే రైతులకు మంచి అవకాశమని, రైతులు తమ పొలాలకు చెందిన పత్రాలు సర్వే సిబ్బందికి ఇచ్చి తమ పొలాల హద్దులను ఏర్పాటు చేయించుకోవాలన్నారు. భూ రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాటు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తే ఉపేక్షించమని సిబ్బందికి సూచించారు. రీసర్వే నిర్దేశిత సమయం లోగా పూర్తిచేయాలని తహసీల్దార్, మండల సర్వేయర్‌లను ఆదేశించారు. ఏడీ జిల్లా సర్వే గౌస్‌బాషా, తహసీల్దార్ బీవీ రమణారావు, మండల సర్వేయర్ కే.స్నేహ, వీఆర్ఓ జె.సరస్వతి, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

40 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

కొండపి: అక్రమంగా తరలిస్తున్న 40 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొండపి ఎస్సై ప్రేమ్ కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని తాటాకులపాలెం గ్రామంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు గ్రామ శివారులో తనిఖీ చేపట్టారు. మినీ ట్రక్‌లో అక్రమంగా తరలిస్తున్న 40 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వట్టికొండ బంగారయ్య, గరితోటి అశోక్‌ను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం ట్రక్

మీటర్ రీడర్లకు కూటమి షాక్!




- చిరుద్యోగుల పొట్టకొట్టేలా కూటమి ప్రభుత్వం అడుగులు
- స్మార్ట్ మీటర్ల రాకతో విద్యుత్ మీటర్ రీడర్ల భవిష్యత్ ప్రశ్నార్థకం
- జిల్లాలో 20 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న 250 మంది మీటర్ రీడర్లు
- భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతున్న ఉద్యోగులు
- నేడు విజయవాడలో రాష్ట్ర స్థాయి మహాసభ

కంభం:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకుంటున్న నిర్ణయాలు చిరుద్యోగుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. పాలకులు అమలు చేస్తున్న ఒక్కో నిర్ణయం ఒక్కో శాఖలో పని చేసే చిరుద్యోగుల పొట్టకొట్టేలా ఉండటంతో ఎవరి ఉద్యోగాలు ఉంటాయో.. ఎవరివి ఊడిపోతాయో అంతుచిక్కడం లేదు. గతంలో ఉన్న కరెంటు మీటర్ల స్థానంలో ప్రస్తుతం రీచార్జ్ స్మార్ట్ మీటర్లు బిగిస్తుండటంతో గడిచిన 18 ఏళ్లుగా విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న మీటర్ రీడర్ల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. మీటర్ రీడర్లు 2001వ సంవత్సరం నుంచి విధులు నిర్వహిస్తున్నారు. అంతకు ముందు మాన్యువల్ విధానంలో బిల్లులు ఇస్తుండగా 2001లో మీటర్ రీడర్స్ బిల్లులు ఇవ్వడం ప్రారంభించారు. 2001లో రూరల్ ప్రాంతంలో ఒక బిల్లుకు 75 పైసలు, పట్టణంలో ఒక బిల్లుకు రూ.50 పైసల నుంచి మొదలై ప్రస్తుతం రూరల్‌లో ఒక బిల్లుకు రూ.3.10 పైసలు, పట్టణంలో రూ.3.00 చొప్పున చెల్లిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం జనవరి నుంచి కొత్త కాంట్రాక్టర్ల ద్వారా ఇదే విధంగా ఇస్తున్నారు.

స్మార్ట్ మీటర్లతో భవిష్యత్ ప్రశ్నార్థకం

గత రెండు నెలల నుంచి ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు, వాణిజ్య సంస్థలు, పరిశ్రమల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు. అవి పూర్తయిన వెంటనే గృహాల్లో స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియ ప్రారంభం కానుంది. స్మార్ట్ మీటర్లు బిగించడం పూర్తయితే జిల్లాలో పనిచేస్తున్న 250 మంది మీటర్ రీడర్ల ఉద్యోగాల్లో గాల్లో దీపాల్లా మారిపోతాయి. తమ ఉద్యోగ భద్రత కోసం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో పాటు మంత్రులు నారాలోకేష్, పవన్ కళ్యాణ్ వద్ద గోడు వెళ్లబోసుకున్నా మీటర్ రీడర్లకు భవితకు హామీ లభించలేదు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం లేదని మంత్రులు సర్దిచెప్పి పంపడంపై మీటర్ రీడర్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కమర్షియల్ స్మార్ట్ మీటర్లు బిగించేస్తున్నారని, ఆ తర్వాత గృహాల్లో ఏర్పాటు చేస్తారని, అప్పుడు తమను కరివేపాకులా తీసి పడేస్తారని వాపోతున్నారు. గత 18 ఏళ్లుగా పని చేస్తున్న మీటర్ రీడర్లకు విద్యుత్ సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని మీటర్ రీడర్లు డిమాండ్ చేస్తున్నారు.


కంభంలో ఓ దుకాణంలో స్మార్ట్ మీటర్ బిగిస్తున్న ప్రైవేట్ సిబ్బంది

నేడు విజయవాడలో మహాసభ

రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 4 వేల మంది మీటర్ రీడర్ల ఉద్యోగ భద్రత కోసం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ ఆధ్వర్యంలో విజయవాడలో రాష్ట్రస్థాయిలో మహాసభ నిర్వహించనున్నారు. ఈ మహాసభలో ఉద్యోగ భద్రత కోసం చేయాల్సిన పోరాటాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రకటన తదితర అంశాలపై చర్చించనున్నట్లు సంఘ నాయకులు చెబుతున్నారు. మహసభలు విజయవంతం చేయాలని కోరుతూ ఇప్పటికే మహాసభలపై ప్రచారం నిర్వహించిన మీటర్ రీడర్లు విజయవాడకు పయనమయ్యారు.

స్మార్ట్ మీటర్లు రావన్నారు.. ఇప్పుడు బిగిస్తున్నారు



మా యూనియన్ నాయకులు మంత్రులను కలిసి వినతి పత్రాలు ఇచ్చినప్పుడు స్మార్ట్ మీటర్లు రావని చెప్పారు. ఇప్పుడేమో అవే మీటర్లు బిగించేస్తున్నారు. అవి పూర్తయిన తర్వాత మా ఉద్యోగాలు ఉంటాయో లేదో అర్థం కావడం లేదు. ప్రభుత్వం స్పందించి మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

– సయ్యద్ హుస్సేన్, మీటర్ రీడర్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

ఉద్యోగ భద్రత కల్పించాలి



నేను 18 ఏళ్లుగా మీటర్ రీడర్‌గా పని చేస్తున్నా. ఇప్పుడు ఉద్యోగాలు ఉంటాయో పోతాయో అర్థం కావడం లేదు. ఒక వేళ తొలగించాల్సి వస్తే మాకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ శాఖలో లేదా ఇతర శాఖల్లో ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలి.

– కె.సురేంద్రబాబు, మీటర్ రీడర్ కంభం

మహిళల భద్రత మనందరి బాధ్యత

- ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు సిటీ: మహిళల భద్రత మనందరి బాధ్యత అని, మహిళా ఫిర్యాదుల పరిష్కారానికి ఎల్లప్పుడు సంసిద్ధంగా ఉండాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలులోని పోలీస్ కల్యాణ మండపంలో అన్ని పోలీస్ స్టేషన్ల మహిళా సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే మహిళా ఫిర్యాదుదారులతో పోలీసులు వ్యవహరించాల్సిన విధానంపై దిశానిర్దేశం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్లో ఉమెన్ హెల్ప్ డెస్క్ వద్ద మహిళా సిబ్బంది ఉండాలని చెప్పారు. మహిళలు, బాలలు పోలీస్ స్టేషన్‌కు వచ్చి నిర్భయంగావారి ఫిర్యాదు చేయగలిగే వాతావరణాన్ని కల్పించాలన్నారు. మహిళలతో గౌరవంగా మాట్లాడాలని, వారి సమస్యలను ఓపికగా వినాలని హితవు పలికారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడానికి అన్ని విధాలా ప్రయత్నించాలని సూచించారు. అవసరమైన సాక్ష్యాలు సేకరించి భద్రపరచాలన్నారు. మహిళల ఫిర్యాదులను గోప్యంగా ఉంచాలని, వారి వ్యక్తిగత సమాచారం, కేసు వివరాలను ఎవరితోనూ పంచుకోకూడదని స్పష్టం చేశారు. మహిళా హెల్ప్ డెస్క్ వద్ద తగిన మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. న్యాయ సహాయం, వైద్య సహాయం అందించడానికి కూడా సిద్ధంగా ఉండాలన్నారు. మహిళలు, పిల్లల కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా దర్యాప్తు చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలలకు పోలీసు సిబ్బంది వెళ్లి గుడ్ టచ్–బ్యాడ్ టచ్, ఆకర్షణ ప్రేమ ప్రభావాలు, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, స్వీయ రక్షణలపై అవగాహన కల్పించాలన్నారు. మహిళా సిబ్బంది సంక్షేమం దృష్ట్యా ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, ప్రత్యేక మెడికల్ క్యాంపులు సైతం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీసీఆర్బీ సీఐ దేవ ప్రభాకర్, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, ఒంగోలు టౌన్ మహిళా ఎస్సైలు రజియా సుల్తాన్, అనిత, కష్ణ పావని, సువర్ణ, ఆర్ఎస్సై సురేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్


సమావేశంలో పాల్గొన్న మహిళా పోలీసు అధికారులు

చెరువులో దూకి
బిడ్డతో సహా తల్లి బలవన్మరణం

- మతిస్థిమితం లేకనే అంటున్న కుటుంబ సభ్యులు

సంతనూతలపాడు:

ఎనిమిది నెలల పసిబిడ్డతో సహా తల్లి చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన సంతనూతలపాడులో బుధవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. సంతనూతలపాడుకు చెందిన బాపట్ల వెంకటేష్‌కు బోడపాలెం గ్రామానికి చెందిన సుజాత(28)తో నాలుగున్నరేళ్ల క్రితం వివాహమైంది. వీరు స్థానిక ముద్రగడ బజారులోని అంకమ్మ దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్నారు. సురేష్ గొర్రెలను పెంచుతూ కుటుంబాన్ని వెళ్లదీస్తున్నాడు. వీరికి తొలుత ఆడబిడ్డ జన్మించగా అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతి చెందింది. అనంతరం 8 నెలల క్రితం మరో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఏడాది క్రితం వెంకటేష్‌కు చెందిన రూ.లక్షల విలువైన పశువులు అంతు చిక్కని వ్యాధులతో మరణించాయి. దీంతో ఆ కుటుంబాన్ని ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి.

ఈ నేపథ్యంలో అప్పులు ఎలా తీర్చాలి అనే దిగులుతో పాటు.. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సుజాత మతిస్థిమితం లేక.. బలవన్మరణానికి పాల్పడి ఉండవచ్చని కుటుంబసభ్యులు భావిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున స్థానిక చెరువులో చంటి బిడ్డ బాపట్ల ఏశ్వజ్ఞ (8నెలలు) మృతదేహం బయటపడడంతో ఈ విషయం వెలుగు చూసింది.

తల్లీబిడ్డల ఆత్మహత్యపై సమాచారం అందుకున్న సంతనూతలపాడు ఎస్ఐ అజయ్ కుమార్ గాలింపు చర్యలు చేపట్టి మహిళ మృతదేహాన్ని చెరువులోంచి బయటకు తీయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. తల్లీబిడ్డ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్ఐ అజయ్‌కుమార్

ఓ పక్క నవోదయం..
మరో పక్క తాగి పొర్లుదాం!

కొమరోలు: జిల్లా కేంద్రమైన ఒంగోలులో రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి నవోదయం 2.0 కార్యక్రమాన్ని గొప్పలు చెప్పుకుంటూ మరీ బుధవారం ప్రారంభించారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆ గొప్పలు అతిగా అనిపిస్తున్నాయి. మండల కేంద్రమైన కొమరోలులో బుధవారం నడిరోడ్డుపైన ఓ వ్యక్తి బెల్టు షాపులో మద్యం సేవించి స్పృహ లేకుండా పడిపోయి ఉన్నాడు. కొమరోలులో బెల్టుషాపుల్లో మద్యం ఏరులై పారుతోంది అనడానికి ఈ చిత్రమే నిదర్శనం. కొమరోలులోని బ్రహ్మంగారిమఠం వీధికి వెళ్లే రహదారిలో పూటుగా మద్యం తాగిన ఓ వ్యక్తి సోయ లేకుండా పడి ఉన్నాడు. రోజూ ఈ ప్రాంతంలో రాష్ట్రీయ రహదారిపై ఉన్న మద్యం దుకాణాలు లేదా బెల్టు షాపుల్లో మద్యం కొనుగోలు చేస్తున్నవారు వీధిలోని చెట్ల కింద తాగుతూ దొర్లుతూ కాలక్షేపం చేస్తున్నారు. అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు, పోలీసులు పట్టీపట్టనట్లుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. బ్రహ్మంగారిమఠంకు వెళ్లే రహదారిలో రోజూ ఇలాంటి పరిస్థితులే కనిపిస్తుంటాయి. స్థానికంగా ఉండే మహిళలు మందుబాబుల ఆగడాలకు భయపడుతూ అలాగే తమ పనులకు వెళ్తున్నారు. నవోదయం 2.0ను ఆర్భాటంగా ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం దానికి తగినట్లుగా చర్యలు తీసుకుని కొమరోలులో, చుట్టుపక్కల దుకాణాలలో బెల్టుషాపులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


మద్యం మత్తులో రహదారిపై స్పృహ లేకుండా పడి ఉన్న ఓ వ్యక్తి

ఉచ్చులు బిగించే వారిపై కేసు నమోదు

యర్రగొండపాలెం: అడవిలో ఉచ్చులు బిగించి జంతువులను వేటాడే వారిపై ఫారెస్ట్ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ నెల 15వ తేదీన మండలంలోని కొలుకుల బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో అడవి పందుల కోసం ఉచ్చు బిగించారు. ఈ ఉచ్చులో చిక్కుకొని చిరుతపులి మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఈ కేసును ముమ్మరం చేసిన ఫారెస్ట్ అధికారులు బుధవారం నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. అనుమానితులైన కొలుకులకు చెందిన ఇద్దరు, చెన్నరాయునిపల్లెకు చెందిన మరో ఇద్దరిపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆ శాఖకు చెందిన ఒక అధికారి తెలిపారు. కేసు విచారణ పూర్తయిన అనంతరం ఆ నలుగురు అనుమానితులను అరెస్ట్ చేయనున్నట్లు తెలిసింది. అందుకు ఫారెస్ట్ అధికారులు స్థానిక సీఐ సీహెచ్ ప్రభాకరరావు సహకారాన్ని కోరినట్లు సమాచారం.

వీఆర్వో అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ


వీఆర్వోల అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ఒంగోలు సిటీ: గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ 2025 క్యాలెండర్, డైరీని కలెక్టరు ఎ.తమీమ్ అన్సారియా బుధవారం స్థానిక ప్రకాశం భవనంలోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘ జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిరెడ్డి, ట్రెజరర్ కె.జానయ్య, రాష్ట్ర నాయకులు రవికుమార్, జిల్లా నాయకులు వెంకట్రామయ్య, నాసర్‌వలి, ఒంగోలు మండల అధ్యక్షుడు ఎస్కే యస్థాని, ఎం.సురేష్, జి.వెంకటరెడ్డి, మహేంద్రారెడ్డి, ఎస్.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఎయిడెడ్'లో సీఆర్పీలను కేటాయించాలి

- ఏపీ టీచర్స్ గిల్డ్ డిమాండ్

ఒంగోలు సిటీ: జిల్లా వ్యాప్తంగా ఉన్న 40 సింగిల్ ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్లు సెలవు పెడితే సీఆర్పీలను కేటాయించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగిల్ ఎయిడెడ్ పాఠశాలల్లో టీచర్ సెలవు పెడితే ఆ పాఠశాలకు కొంత మంది మండల విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులను, సీఆర్పీలను పంపకపోవడాన్ని తప్పుబట్టారు. సెలవు పెట్టిన టీచర్లే ప్రైవేట్ టీచరును ఏర్పాటు చేసుకోవాలని ఎంఈఓలు చెప్పడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెలవు పెడితే.. ఇద్దరు ఎయిడెడ్ టీచర్లు ఉన్న స్కూళ్ల నుంచి పంపుతున్నారు కానీ ఎయిడెడ్ స్కూళ్లలో టీచరు సెలవు పెడితే ఎందుకు పంపడం లేదని ప్రశ్నించారు. డీఈఓ స్పందించి ఎయిడెడ్ స్కూళ్లకు సీఆర్పీలను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

స్కూల్ బస్సును ఢీకొన్న ఆటో

- ఏడుగురికి స్వల్ప గాయాలు

జరుబులవారిపాలెం (కారంచేడు): రోడ్డు పక్కన ఆగి ఉన్న స్కూల్ బస్సును కూలీలతో వస్తున్న ఆటో ఢీకొట్టడంతో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన కారంచేడు మండలంలోని జరుబులవారిపాలెం నుంచి ఇంకొల్లు వెళ్లే మార్గంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై వి.వెంకట్రావు కథనం మేరకు.. ఇంకొల్లుకు చెందిన ఒక ప్రైవేట్ స్కూల్ బస్సు విద్యార్థుల కోసం కేశవరప్పాడు వచ్చి వెళ్తోంది. ఈ సమయంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న బస్సును వ్యవసాయ కూలీలతో ఇంకొల్లు నుంచి కేశవరప్పాడు వస్తున్న ఆటో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటో పొలాల్లోకి దూసుకెళ్లగా కూలీల్లో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చీరాల ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా స్థానికులు మాత్రం ఆటోను స్కూల్ బస్సు వచ్చి ఢీకొట్టిందని చెబుతున్నారు. దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని ఎస్సై చెప్పారు.

నేను చస్తా.. నా బిడ్డలు జాగ్రత్తా..

- సోషల్ మీడియాలో కలకలం రేపిన వీఓఏ లెటర్

సింగరాయకొండ: 'నేను డబ్బులు కాజేశానని డ్వాక్రా గ్రూపు సభ్యుల మధ్య దోషిగా నిలబెట్టి అవమానించారు. నేను ఆత్మహత్య చేసుకుంటున్నా. నా ఆత్మహత్యకు టీడీపీ నాయకుడు పులి ప్రసాద్, ఏపీఎం భాగ్యలక్ష్మి కారణం. నా బిడ్డలకు న్యాయం చేయండి' అంటూ సింగరాయకొండ మండలంలోని బింగినపల్లి గ్రామానికి చెందిన వీఓఏ జి.ఈశ్వరి పేరుతో రాసిన లెటర్ సోషల్ మీడియాలో బుధవారం హల్‌చల్ చేసింది. ఈ లేఖ గ్రామ స్థాయిలో టీడీపీ నేతల మధ్య ఆధిపత్య పోరును బట్టబయలు చేసింది. లేఖలో ఏముందంటే.. 'నేను వీఓఏగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నుంచి పనిచేస్తున్నా. టీడీపీలో పులిప్రసాద్, సన్నెబోయిన మాలకొండయ్య వర్గాలున్నాయి. నేను మాలకొండయ్య వర్గం కావడంతో పులిప్రసాద్ వర్గం వారు నాపై అవినీతి ఆరోపణలు చేశారు. దానికి ఏపీఎం కూడా సహకరించి నన్ను గ్రూపు సభ్యుల మధ్య పంచాయితీలో నిలబెట్టారు. ఈ అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నా. నాకు గంగమ్మ గ్రూపు సభ్యులు బ్యాంకులో కట్టేందుకు అప్పుడప్పుడు డబ్బు ఇస్తుంటారు. కానీ వారు ఎక్కువగా మా చిన్నత్త పి.ప్రభావతికే డబ్బు ఇస్తారు. 16 నెలలుగా ఆమె వాయిదాలు కట్టకపోతే నేను ఎలా బాధ్యురాలిని అవుతా. టీడీపీలో గ్రూపు విభేదాల వల్ల ప్రసాద్ వర్గానికి చెందిన గ్రూపు సభ్యులు ముగ్గురు నాతో గొడవకు దిగారు' అని వీఏఓ ఆరోపించింది. దీనిపై ఏపీఎంను వివరణ కోరగా.. 'వీఓఏ ఈశ్వరి సుమారు రూ.7.85 లక్షలు వాడుకుందని గంగమ్మ గ్రూపు సభ్యులు ఫిర్యాదు చేయడంతో గ్రామానికి వెళ్లా. అప్పటికే ఆమె తన ఇంట్లో మంచంపై పడుకుని సెలైన్ కట్టించుకుని ఉంది. నాతో బాగానే మాట్లాడింద'ని వివరించారు.


వేణుగోపాలస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో)రుక్మిణీ సత్యభామ సమేతంగా స్వామివారు

కృష్ణం వందే జగద్గురుం

- వైభవంగా వేణుగోపాలుని రథోత్సవం
- భక్తుల శరుణుఘోషతో మారుమోగిన తర్లుపాడు వీధులు

తర్లుపాడు: అశేష భక్తజనం భక్తిపారవశ్యంతో శ్రీకృష్ణ నామాన్ని స్మరిస్తుండగా వేణుగోపాలుడు ఉభయ దేవేరులతో కలిసి రథంపై ఊరేగాడు. తర్లుపాడులోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఉభయ దేవేరులతో కలిపి స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అర్చకులు ప్రతిష్ఠించి పూజలు చేశారు. స్వామివారి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పొదిలి సీఐతో పాటు తర్లుపాడు ఎస్సై బ్రహ్మనాయుడు ఇంకా పలువురు ఎస్సైలు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జవ్వాజి విజయభాస్కర్, గ్రామ ప్రముఖులతోపాటు ఈఓ చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాతల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేయడంతోపాటు మజ్జిగ ప్యాకెట్లు, తాగు నీరు, పానకం, వడపప్పు పంపిణీ చేశారు.